


# శ్రీవారి పాదసేవ

వసుంధర

రామభద్రయ్య కూతురి కాపురం గురించి నలుగురూ చెప్పుకునేది విని బాధ పడ్డాడు.

అల్లుడు నెలకు మూడువేలు సంపాదిస్తున్నాడు. బుద్ధిమంతుడు. దురలవాట్లు ఏమీలేవు. అంతవరకూ బాగానే వుంది గానీ అతడికి భార్యంటే విపరీతమైన అభిమానం. ఇంట్లో ఆమెనాట్టే పనిచేయనివ్వడు. మనుమ లిద్దరే అయినా వాళ్ళకి ముగ్గురు పనిమనుషు లున్నారు. అదీ బాగానే వుంది.

ఉన్న ఇబ్బందల్లా అల్లుడు తరచుగా పత్నీసేవ చేస్తూంటాడు. అందులో మూ గుంభన లేదు. ప్రతిదానికీ ఆమె అనుమతి అడగడమటుంచి నలుగురూ చూస్తూండగా ఆమె తలనొక్కడమూ, పాదాలొత్తడమూ చేస్తూంటాడు. ఎవరైనా ఏమైనా అంటే—"సంసార జీవితంలో భార్యాభర్తలిద్దరూ సరిసమానులు. భార్య భర్తను సేవిస్తే అది గౌరవించదగ్గ విశేషమవుతుంది. ఆమెను పతివ్రతని ప్రత్యేక విలువ నిస్తున్నారు. భర్త భార్యను సేవించుకుంటే అది తప్పెందుకయింది? మన సమాజంలో స్త్రీ పురుషుడితో సమానం కావాలంటే నా వంటి పత్నీవ్రతుల సంఖ్య పెరగాలి"

అంటున్నాడతడు.

అనోటా అనోటా ఇది విన్నాక కావలసినవాళ్ళలో ఒకాయన రామభద్రయ్యను స్వయంగా కలుసుకుని - "నీ కూతురు మొగుడికేదో మంత్రం వేసింది. ఇదేం బాగోలేదు. దానికో ఉత్తరం రాసి హెచ్చరించు-" అని చెప్పాడు. అప్పుడు రామభద్రయ్య విషయం భార్యతో చర్చించాడు.

"చిన్నప్పట్నించీ కుసుమ అంతేనండీ! ఆడవాళ్ళను తక్కువచేస్తున్నారని అందరిమీదా అలుగుతుండేది. పెళ్ళి అయితే తను నలుగురిలాకాక స్వతంత్రంగానూ కొత్త విధంగానూ కాపురం చేస్తాననేది. దానికీ మొగుడికీ ఇష్టమైనప్పుడు మన కెందుకు? అందులోనూ అది ఉత్తరాలకు లొంగే మనిషికాదు అపార్థం చేసుకుని మీమీదా నామీదా అలగొచ్చు కూడా-" అంది రామభద్రయ్య భార్య.

"అయితే నేను స్వయంగా వెళ్ళి మాట్లాడతాను" అన్నాడు రామభద్రయ్య ఆవేశంగా.

"వద్దండీ-దానితో వాదించి నెగ్గలేరు మీరు. దానితో వాదించినప్పుడల్లా నాకు మీవల్ల అన్యాయం జరుగుతోందనిపించేది. ఇప్పుడు మీ దక్కడికి వెళ్ళివచ్చారంటే-నాకు పాదసేవ చేస్తానంటారేమోనని నా భయం" అందామె.

రామభద్రయ్య కాసేపు తటపటాయించినా- "లాభంలేదు. యిలాంటి దారుణం నా కళ్ళముందే నా కూతురివల్లే జరిగిపోతుంటే-సరిదిద్దడం తండ్రిగా నా బాధ్యత-" అన్నాడు.

ఏమీ అనలేక "మీ యిష్టం" అని ఊరుకుందాయన భార్య.

ఆరోజే బస్సు ప్రయాణం చేసి రాజమండ్రి నుంచి విజయవాడ వెళ్ళాడు రామభద్రయ్య. ఆయన కూతురింటికి వెళ్ళేసరికి - ఇంటితలుపులు బార్లా తెరిచివున్నాయి. పనిమనిషి ఇల్లు తుడుస్తోంది. సోఫాలో బోర్లా పడుకుని కుసుమ ఏదో నవల చదువుకుంటోంది. ఆమె పాదాలు భర్త ఒడిలో ఉన్నాయి. అతడు సుతారంగా ఆమె పాదాలు నొక్కుతున్నాడు.

ఆ దృశ్యం చూసి యిబ్బందిగా "అమ్మాయ్ కుసుమా!" అన్నాడు రామభద్రయ్య.

కుసుమ చటుక్కున లేచి కూర్చుని తండ్రిని చూసి అభిమానంగా ఎదురు వెళ్ళి పలకరించింది అప్పటికి రామభద్రయ్య ఏమీ అనలేదు అయితే అంతటితో అయిపోలేదు. తర్వాత కూడా ఆయన మరికొన్ని విశేషాలు చూశాడు.

అల్లుడు వంటమనిషికి కూరలు తరిగి యిచ్చాడు. దొడ్లో ఆరిన బట్టలన్నీ తెచ్చి మడతలు పెట్టాడు. కుసుమ పనిలోకి రాబోతే- "నువ్వెళ్ళు మీ నాన్నగారితో కబుర్లు చెప్పుకో-" అన్నాడు భోజన సమయంలో కంచాలు, మంచినీళ్ళు వగైరాలన్నీ అతడే డైనింగ్ టేబిల్ పై

పడ్డారు. రాత్రి పడుకుందుకు మామగారికి తనే స్వయంగా పక్క-ఏర్పాట్లు చూశారు.

రామభద్రయ్య, కుసుమ అంతవరకూ ఏం మాట్లాడుకున్నా ఈ విషయం మాత్రం మాట్లాడుకోలేదు. అయితే రామభద్రయ్య ఆలోచనల నిండా కూతురు చేస్తున్న తప్పు గురించి ఆమె కెలా చెప్పాలా అన్న విషయమే ఉంది. ఆ రాత్రి ఆయనకు నిద్ర రాగానే పట్టినప్పటికీ కలలో కూడా ఆ విషయమే!

మర్నాడు కూడా ఇంట్లో మార్పేమీ లేదు. రామభద్రయ్య అల్లుడు పీలువడి వంట పనిచేసి ఆఫీసుకు వెళ్ళారు. అతడిలా వెళ్ళగానే అలా రామభద్రయ్య కూతుర్ని పిలిచి నెమ్మదిగా "మీ కాపురం చిత్రంగా వుందమ్మా! అల్లుడి పద్ధతి చూసి నలుగురూ నవ్వుతున్నారు. నీ గురించి అంతా చెడ్డగా చెప్పుకుంటున్నారు-" అన్నాడు.

కుసుమ నిట్టూర్చి "ఇలాంటి పద్ధతికి పదిమందీ అలవాటుపడాలంటారాయన. మొదట్లో ఎవరేమనుకున్నా క్రమంగా తనకు అనుచరులేర్పడుతారని ఆయన నమ్మకం-" అంది.

"మీరిద్దరూ ఏకాంతంలో ఎలాగున్నా బాధలేదమ్మా! కానీ పదిమందీ చూసేటప్పుడీ పాదసేవలూ అవీ చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది..."

"నువ్వు చెప్పింది నిజమేకానీ చెప్పాల్సింది నాక్కాదు—వారికి!"

"చూడమ్మా! అతడు నాకు పరాయి మనిషి. నీ దగ్గరైతే చనువుగా అన్నీ చెప్పగలను. అవన్నీ నువ్వతడికి చెప్పుకోవాలి..."

"చెబితే వినరు నాన్నా!"

"అసలతడు వినాలని నీకుంటే - అతడు తప్పక వింటాడు..."

"వినరు నాన్నా!"

"ఎందుకు వినడు?" అన్నారు రామభద్రయ్య చిరాగ్గా.

"స్త్రీకి బానిసత్వం నుంచి విమోచన కలిగించాలని ఆయనకుంటే - పాతివ్రత్యంలాగే పత్నీవ్రతమూ పదిమంది గౌరవాన్నీ పొందాలని ఆయనకుంటే - ఆయన చేస్తున్న పనులు నాకు కొంత సంతోషాన్ని కలిగించేవే! రోజూ ఆఫీసుకు వెళ్ళి పనిచేసే మనిషిచేత - యింట్లో ఖాళీగా కూర్చునే నేను-యింటి పనులూ వంటపనులూ చేయించాలనుకునే మూర్ఖురాలినీ, దుర్మార్గురాలినీ కాదు నేను. ఆయన చేస్తున్న పనులు నాకు నచ్చడం లేదు కానీ ఈ దేశంలో ఆడదానికి స్వతంత్రం లేదు, రాదు. నే నాయన చేస్తున్నవి భరించలేక పోతున్నాను. కానీ అసహాయురాలిని-"

"అంటే నీకిష్టంలేక పోయినా అల్లుడు నీకు పాదసేవ చేస్తున్నాడని నమ్మమంటావా? అలాగే నమ్ముతాను. కానీ అతడిలా చేయడాని క్కారణమేమిటో చెప్పు..."

"వారు పనిచేస్తున్న కంపెనీ యజమాని అర్ధాంతరంగా చనిపోతే-ఆయన భార్య కంపెనీ నిర్వహణ బాధ్యతలు స్వీకరించింది. ఆరంభంలో ఆడదిగా ఆమె అనేక ఇబ్బందుల నెదుర్కొని తట్టుకుని నిలబడింది. ఫలితంగా ఆమె పురుషద్వేషిణిగా మారింది. తన ఆఫీసులో పనిచేసే పురుషుల మీద ఆమె ప్రత్యేకంగా జాలుంచేసి చిన్నబుచ్చుతుంది. అయితే నీ అల్లుడు తెలివైనవారు. స్త్రీ గొప్పతనాన్ని పొగిడి, పురుషుణ్ణి చిన్నబుచ్చుతూ ఆమెవద్ద మాట్లాడి వారామెకు ప్రీతిపాత్రులయ్యారు. ఆమెను సంతోషపెట్టడం కోసమే వారు పత్నీవ్రతులయ్యారు. వారి గురించిన ప్రచారాన్ని విని ఆమె మా యింటికి కూడా వచ్చి మా కాపురం చూసి సంతోషించి వెళ్ళింది పత్నీవ్రతం కారణంగా వారామెకు ప్రీతిపాత్రులు. తరచుగా ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు వస్తుంటాయి-ఇదీ వారి విపరీత పద్ధతికి కారణం-" అంది కుసుమ.

"నేను నమ్మలేను. ఈ కథ నువ్వు కల్పించావు. చిన్నప్పట్నుంచీ నీ భావాలు నాకు తెలుసు. నువ్వు కావాలనే అల్లుడి చేత యిలా చేయిస్తున్నావ్..."

"నాన్నా! కట్నానికి వ్యతిరేకంగా ఆదర్శాలు పలికిన నా క్లాస్‌మేట్ కుర్రాళ్ళందరూ కట్నాలు తీసుకునే పెళ్ళిళ్ళు చేసుకున్నారు. మనదేశంలో ఆదర్శాలు పలికించడానికేగానీ ఆచరణకు కాదు. నేనూ అలాంటిదాన్నే! నాకూ నలుగురికిలా కాపురం చేసుకోవాలనుంది తప్ప నలుగురిలో నా భర్త నవ్వులపాలు కావాలని లేదు చేతనైతే నువ్వే వారికి నచ్చచెప్పు-"

"తప్పంతా నీమీదుంచుకుని-నన్ను అతడికి నచ్చచెప్పమంటున్నావు. దీన్నే ముందరికాళ్ళకు బంధం వేయడమంటారు-" అన్నాడు రామభద్రయ్య.

కుసుమ అప్పటికింకేమీ మాట్లాడలేదు. మధ్యాహ్నం మూడయ్యాక ఆమె "ఊళ్ళోకి కొత్తగా ఓ అద్భుత ప్రదర్శన వచ్చింది. నువ్వు చూసి తీరాలి. పద. వెడదాం-" అంది.

"అల్లుణ్ణి కూడా రానీ!" అన్నాడు రామభద్రయ్య

"వారు-నేను కలిసి చూడనే చూశాం. ఇక నువ్వే చూడాలి-" అని చెప్పి కుసుమ తండ్రినా ప్రదర్శనకు తీసుకుని వెళ్ళింది.

ఒక శిక్షకుడు — రెండు కోతులకు అద్భుతంగా శిక్షణ ఇచ్చి అపూర్వ ప్రదర్శనలు చేస్తున్నాడు. మగకోతి కసరత్తు చేస్తే ఆడకోతి నృత్యంచేస్తుంది. మగకోతి సిగరెట్ కాల్చితే ఆడకోతి పొయ్యి వెలిగిస్తోంది రెండు కోతులూ ముఖంలో అద్భుత భావప్రకటన కూడా చూపుతున్నాయి.

శిక్షకుడా రెండు కోతులతో- "మీ

రిద్దరూ చక్కటి జంట అవుతారు. మీ యిద్దరికీ పెళ్ళిచేస్తామ సరేనా?" అన్నాడు. వెంటనే రెండు కోతులూ చెరో కర్రా తీసుకుని వాడిని కొట్టబోయాయి. శిక్షకుడు వాటి బారినుంచి తప్పించుకోలేక చేతులు జోడించి నమస్కరించి- "నన్ను వదిలి పెట్టండి మీ యిష్టానికి వ్యతిరేకంగా ఏమీ చేయను-" అన్నాడు.

రామభద్రయ్య ప్రదర్శనలో లీనమై పోయాడు. అప్పుడాయనకు కూతురి మాటలతో ధ్యానభంగమైంది- "నాన్నా! ఆ కోతుల కోపం నిజమైనదికాదు. యజమాని ఆజ్ఞాపించగా అవి అతడిపై కోపం ప్రకటించాయి. అంతేతప్ప వాటికి స్వతంత్రంలేదు. స్వతంత్రముంటే అవి హాయిగా ఏ చెట్లమీదనో విహరిస్తూం డేవి. యజమాని వాటిచేత వాటికిష్టంలేని ప్రదర్శన లిప్పించి డబ్బు సంపాదించు కుంటున్నాడు. వాటి మెడలో మలకతాడు వుంది. నా మెడలో పసుపుతాడు వుంది. మా యిద్దరికీ తేడా ఏమీలేదు. శ్రీవారు నాకు పాదసేవ చేస్తూ పదిమందికీ ప్రదర్శిస్తూ వుంటే నా కది నరకప్రాయంగా వుంది. అయన్ను వారించగల స్వతంత్రం, శక్తి నాకు లేవు. మీకు చేతనైతే వారిని మార్చి నా జీవితంలోని అసంతృప్తిని తొలగించు నాన్నా!" అందామె.

రామభద్రయ్య ఉలిక్కిపడి కుసుమ వంక చూశాడు. ఆమె కళ్ళలో తిరుగుతున్న నీళ్ళు ఆయన ఆలోచనలకు పదును పెట్టాయి.

తనిప్పుడు తలచుకుంటే జంతువుల పట్ల క్రూరంగా ప్రవర్తిస్తున్నాడన్న నేరం మోపి- ఆ రెండు కోతుల్ని యజమాని బారినుంచి రక్షించగలడు. కానీ కూతురి వైకే మార్చాలని వచ్చిన తమ-కూతురి అభీష్టానికి అనుగుణంగా అల్లుణ్ణి మార్చగలడా?

ఆలోచిస్తూనే రామభద్రయ్య తిరుగు ప్రయాణమయ్యాడు. ఆయన యిప్పటికీ ఆలోచిస్తూనే ఉన్నాడు. ✱

